

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు:డిఎస్పి

ప్రజాశక్తి-రామచంద్రపురం/మండపేట

సబ్ డివిజన్‌పరిధిలో రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు, మండపేట టౌన్, మండపేట రూరల్, అంగర, రాయవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలంతా 31న రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని రామచంద్రపురం డిఎస్పి బిఎస్ఆర్.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో అంతటా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. డిఎస్పి వద్ద నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎటు వంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటి వాటిని నిర్వహించరాదన్నారు. ..జాతీయ రహదారి(రోడ్ల)పై,పబ్లిక్‌స్థలాల్లో వేడుకలు అనుమతించబడవన్నారు. ఫైర్ క్రాకర్స్ కాల్చడం నిషేధమన్నారు. మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు, బార్లు నిర్ణీత సమయంలో మూసి వేయాలన్నారు.నూతనసంవత్సరవేడుకలుఅర్ధరాత్రి 1గంటలోపు ముగించుకోవాలన్నారు.

2023 స్మృతి కవనం...

కొంత ఖేదం.. కొంత మోదం.. సుఖసంతోషాలు, కష్టనష్టాలతో ఈ ఏడాది మరో కొన్ని గంటల్లో కాలగమనంలో కలిసిపోనుంది. మంచిచెడులను మనకే వదిలేసి మాయమైపోనుంది. జరిగిన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకుని మంచిగా జీవించాలనే సందేశాన్నిచ్చింది. ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది. రాజకీయ మార్పులకు వేదికైంది. ఎన్నో స్మృతులను తనలో నిక్షిప్తం చేసుకుంది. ఆ స్మృతుల కవనం ఒకసారి మననం కోసం...

జనవరి 2023



సిఐటియు చైతన్య ర్యాలీ

1న సిఐటియు కార్మిక చైతన్య ర్యాలీ ఆదివారం తూర్పుగోదావరి జిల్లాలో ప్రవేశించింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద కాటన్ విగ్రహానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు, అఖిలభారత జాతీయ ఉపాధ్యక్షులు బేబీరాణి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. పలుచోట్ల సభల్లో వారు మాట్లాడారు.

2న సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాజమహేంద్రవరం పర్యటించారు. పెన్షన్ పెంపును లాంఛనంగా ప్రారంభించారు.

9న పరంపర అక్రమాలపై ఎపి పేపర్ మిల్లు ఎదుట కార్మికులు గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. పంప్‌హౌస్‌ను అద్దెకివ్వటంతో పేపరు మిల్లు యాజమాన్యం మధ్యాహ్నం తర్వాత తాత్కాలికంగా ఉత్పత్తిని నిలిపివేసింది.

22న కాకినాడకు చెందిన డాక్టర్ చంద్రశేఖర్‌పద్మ పురస్కారానికి ఎంపికయ్యారు.

ఫిబ్రవరి 2023



బాలోత్సవం

6న సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు కదం తొక్కారు. కాకినాడ జిల్లా జడ్‌పి సెంటర్ వద్ద జరిగిన మహాధర్నాకు వేలాది మంది అంగన్‌వాడీలు తరలి వచ్చారు.సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబీరాణి మాట్లాడారు. రాజమహేంద్రవరంలో పోలీసులు, అంగన్‌వాడీల మధ్య తోపులాట చోటు చేసుకుంది

9నజి.రాగంపేట గ్రామంలో నిర్మిస్తున్న అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ కంపెనీకి చెందిన పరిశ్రమలో ఆయిల్ ట్యాంకర్ క్లీన్ చేయడానికి దిగి ఊపిరి ఆడక ఏడుగురు కార్మికులు మృతి చెందారు.

15న కాకినాడలో ఒమెన్స్‌హాకీ జాతీయ పోటీలు ప్రారంభమయ్యాయి.

16న ఉమ్మడి జిల్లాలో చంద్రబాబు పర్యటించారు. అనపర్తి వద్ద ఆయన రోడ్‌షోను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త నెలకొంది

25న రాజమహేంద్రవరంలో గోదావరి బాలోత్సవం జరిగింది. పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జి ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు.

మార్చి 2023



పరామర్శ

4న గన్నవరం ఘటన నేపథ్యంలో టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌తో పాటు మరో 13 మంది రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు.

5న టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి మాజీ ఛైర్మన్ వరుపుల రాజా గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. టిడిపి అధినేత చంద్రబాబు ఆయన భౌతికకాయాన్ని సందర్శించారు.

19న 'చలో విజయవాడ' నేపథ్యంలో తూర్పుగోదావరి సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్, ఐద్వా జిల్లా కార్యదర్శి టి.తులసి, సిఐటియు నాయకులను గృహనిర్బంధం చేశారు.

20న అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల పోలీసుల వైఖరిని నిరసిస్తూ కాకినాడలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

ఏప్రిల్ 2023



వసంతకుమార్‌కు నాయకుల నివాళి

5న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో సైకో వీరంగం సృష్టించాడు. ఇద్దరు మహిళలపై చాకుతో దాడి చేశాడు. గొంతు కోయడంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

18న కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెంలో బయోడీజిల్ ట్యాంకులోకి దిగిన ఇద్దరు కార్మికులు ఊపిరాడక మృతి చెందారు.

21న కెవిపిఎస్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి, ప్రజా సంఘాల నాయకుడు పచ్చిమాల వసంత కుమార్ (52) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు.

30న రాజమహేంద్రవరంలో మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి భవాని భర్త ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు

మే 2023



వర్షార్పణం

1న కురిసిన అకాల వర్షాలతో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. సుమారు 90వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా వేశారు.

4న రామచంద్రపురం, మండపేటల్లో పాడైన పంటలను టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పరిశీలించారు. ఆయన పర్యటన రెండు రోజుల పాటు సాగింది.

10న కోనసీమ జిల్లాలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పర్యటించారు. 11న రైతు ప్రతినిధులతో భేటీ అయ్యారు.

14న తాళ్లరేవు మండలం కోరంగిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు.

27న రాజమహేంద్రవరం రూరల్ వేమగిరిలో టిడిపి మహానాడు జరిగింది. టిడిపి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 28న బహిరంగ సభలో మినీ మేనిఫెస్టో ప్రకటించారు.

జూన్ 2023



వారాహి యాత్ర

12న తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలోని అనంతపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. వీరిలో ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన వారితోపాటు, చాగల్లు మండలం ఊనిగట్ల, పోలవరం మండలం ఎన్‌ఎన్‌డి పేటకు చెందిన వారు ఉన్నారు.

14న సత్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం పవన్‌కళ్యాణ్ వారాహి యాత్రను ప్రారంభించారు. కత్తిపూడిలో బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. 20వరకూ కాకినాడ జిల్లాలో ఆయన యాత్ర సాగింది. అనంతరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రవేశించింది. 25న కోనసీమ జిల్లాలో యాత్ర ముగిసింది.

29న కాకినాడలో బ్రెయిన్ డెడ్ అయిన ఒక మహిళ మూత్రపిండాన్ని గ్రీన్ ఛానల్‌లో విశాఖకు తరలించారు.

జులై 2023



వరద పోటు

1న అంగన్‌వాడీల పోరు యాత్ర రాజమహేంద్రవరం చేరుకుంది. కోటిపల్లి బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ మాట్లాడారు.

2న గోకవరం మండలం తిరుమలాయపాలెం ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని సమగ్ర విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేయాలని దళిత, గిరిజన ప్రజాసంఘాల నాయకులు హోమ్ మంత్రి తానేటి వనితను కలిసి వినతిపత్రం అందజేశారు.

11న తమ సమస్యలు పరిష్కరించాలని రాజమహేంద్రవరం సబ్ కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు 36 గంటల మహాధర్నా నిర్వహించారు.

12న రాజమహేంద్రవరంలో మహా ర్యాలీ నిర్వహించారు.

23న గోదావరి ఉధృతితో అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 30కి పైగా లంకగ్రామాలు ముంపు బారిన పడ్డాయి.

28న మరోమారు వరదలు ముంచెత్తాయి

ఆగస్టు 2023



ఎస్ఎఫ్ఐ సైకిల్ ర్యాలీ

4న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.


8న సిఎం జగన్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇదే రోజు తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి, దేవరపల్లి, గోపాలపురంలో టిడిపి అధినేత చంద్రబాబు పర్యటించారు. 8న కోనసీమ జిల్లాలో పర్యటించారు.

12న సిఎం జగన్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించారు. అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు.

16న చంద్రబాబు రాజమండ్రి వచ్చారు. 17 నుంచి 3 రోజులపాటు చంద్రబాబు కోనసీమ పర్యటించారు. రావులపాలెం, అమలాపురం బహిరంగ సభలో మాట్లాడారు.

22న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సైకిల్ యాత్ర నిర్వహించారు. ఎంఎల్‌సి ఐవి పాల్గొన్నారు.

సెప్టెంబర్ 2023



రిమాండ్ ఖైదీ

2న టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర తూర్పు గోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లిలో ఆయన యాత్ర సాగింది.

3న టిడిపి అధినేత చంద్రబాబు కాకినాడ జిల్లా అచ్చంపేటలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని 36 నియోజకవర్గాల ఇన్‌చార్జిల సమావేశంలో పాల్గొన్నారు. టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నల్లజర్ల నుంచి యువగళం పాదయాత్రను ప్రారంభించారు.

9న టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర కోనసీమ జిల్లా మలికిపురంలోకి ప్రవేశించింది. 10న చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి శ్రేణుల ఆందోళనలు నిర్వహించాయి.

11న టిడిపి అధినేత చంద్రబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం అర్ధరాత్రి తరలించారు. దీంతో నగరంలో హై ఎలర్ట్ ప్రకటించారు. యువగళం యాత్ర నిలిచింది.

అక్టోబర్ 2023



గృహ ప్రవేశం

2న ధవళేశ్వరం, రాజమహేంద్రవరం, కొవ్వూరుల్లో ప్రజాసంఘాల నాయకుల ఇళ్లల్లో ఎన్ఐఎ తనిఖీలు నిర్వహించింది.

4న రాజమహేంద్రవరంలో రాష్ట్ర నిరుద్యోగసదస్సు జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


6న సిపిఎం రాష్ట్ర వర్కుషాపు రివర్‌బే హోటల్‌లో ప్రారంభమైంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

11న యానిమేటర్లు సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టరేట్ల వద్ద ఆందోళనకు దిగారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

12న సామర్లకోటలోని ఈటిసి, ప్రత్తిపాడు రోడ్డు లేఅవుట్లలో సామూహిక గృహప్రవేశాలను సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు.

31న రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు విడుదల అయ్యారు.

నవంబర్ 2023



ప్రజా రక్షణ భేరి

3న ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ జాతీయ సమావేశాలు శుక్రవారం కాకినాడలో ప్రారంభమయ్యాయి. సమైక్య జాతీయ అధ్యక్షుడు దెబాశేష్ బర్మన్ అధ్యక్షత వహించారు.

5న ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర తుని వద్ద కాకినాడ జిల్లాలో ప్రవేశించింది. 6న తూర్పుగోదావరి జిల్లా 7న కోనసీమ జిల్లాల్లో కొనసాగింది.

8న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు నిరసనగా బంద్ జరిగింది.

11న పాలస్తీనాపై ఇజ్రయిల్ దాడులను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి.

27న నిలిచిన యువగళం పాదయాత్ర 79 రోజుల విరామం అనంతరం తిరిగి సోమవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పొదలాడ నుంచి తిరిగి ప్రారంభమైంది.

డిసెంబర్ 2023



సాబ్జీ మరణం

2న యువగళం యాత్రం కాకినాడ జిల్లాలో ప్రవేశించింది. .4న మిచౌంగ్ తుపాను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను అతలాకుతలం చేసింది. భారీ, వర్షాలు ఈదురు గాలులకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

12 నుంచి అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెకు దిగారు. సమ్మెలో భాగంగా వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. వీరికి పలు ప్రజా, కార్మిక సంఘాలు, వామపక్షాలతో పాటు టిడిపి, జనసేన, కాంగ్రెస్ మద్దతు తెలిపాయి. 12న సమగ్రశిక్ష, 26న మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు.

15న పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

27 నుంచి 30వ వరకూ కాకినాడలో ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభ జరిగింది. అఖిల భారత నాయకులు హాజరయ్యారు.

మున్సిపల్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె చేపట్టారు. శనివారం సమ్మె అయిదోరోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు వీరికి మద్దతు తెలిపారు.

మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కరించాలని నల్ల రిబ్బన్లు కళ్ళకు కట్టుకుని నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.భాస్కరరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. మరిన్ని సంఘాలను కలుపుకొని డిమాండ్ల సాధన లక్ష్యంగా సమ్మె ఉధతం చేసేందుకు ముందుకు సాగుతున్నామని అన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు కొమరపు నరేంద్ర కుమార్, బంగారు కొండ,



ముమ్మిడివరంలో నలుపు దుస్తులతో నిరసన తెలుపుతున్న కార్మికులకు సిఐటియు నేత సంఘీభావం

లోవరాజు, విజయ్, సవరపు సరోజినీ తదితరులు పాల్గొన్నారు.**ముమ్మిడివరం** మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి దుర్గా ప్రసాద్ డిమాండ్ చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మున్సిపల్ కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెట్టా శివ ప్రసాద్ అధ్వర్యంలో రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన సమ్మె శనివారం 5వ రోజుకు చేరింది.ఈ సమ్మెలో కార్మికులు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం సమ్మె పరిష్కారానికి చర్యలు చేపట్టకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేయడమే కాకుండా దశల వారి ఆందోళనలో భాగంగా డిసెంబర్ 31 నుంచి తాగునీటి సరఫరా, విద్యుత్ వంటి అత్యవసర సేవలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. సమ్మె చేస్తున్న కార్మికులకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పాము బాలయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు మరియు టిడిపి నాయకుడు జనిపల్లి సత్యనారాయణ మద్దతు తెలిపారు.ఈ సమ్మెలో మున్సిపల్ కార్మికులు ఎస్.అరుణ్ కుమార్, నక్కా అరుణ్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, కాశి జార్జి, జి.రమేష్, ఎస్.శరత్ ఎ.సత్తిబాబు, వెంకట రమణ తదితరులు కార్మికులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** మున్సిపల్ కార్మికుల సమ్మె శనివారం 4 వ రోజుకు చేరుకుంది. శనివారం సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం రిలే దీక్షను ప్రారంభించారు. మున్సిపల్ వర్కర్లకు ఆటో యూనియన్ మద్దతు తెలిపింది. ఆటో యూనియన్



మండపేటలో నల్ల రిబ్బన్లతో కార్మికుల నిరసన

వైస్ ప్రెసిడెంట్ కె.సత్తిబాబు నిమ్మరసం ఇచ్చి దీక్ష ను విరమింప చేశారు. సమ్మెలో పిల్లి వెంకటరావు, గుత్తుల తాతారావు, మేడిశెట్టి నాగబాబు, గోరిపర్తి భీమశంకర్, ముత్యాల నాగరాజు, గూడుపు చిన్న అప్పారావు, మందపల్లి వినోద్ లు పాల్గొన్నారు.



రామచంద్రపురం పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమ్మె

పొర్లు దండాలతో నిరసన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సమగ్ర శిక్ష లో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని జిల్లా ఎస్ఎస్ఎ ఉద్యోగుల జెఎసి డిమాండ్ చేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ కళాశాల లోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో రాష్ట్ర జెఎసి పిలుపులో భాగంగా చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 11వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒ లు సంఘీభావం తెలిపారు.ఈ శిబిరాన్ని సందర్శించిన ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఎసఎస్ఎ ఉద్యోగులను విద్యాశాఖ లో విలీనం చేసి వారిని క్రమబద్ధికరించే చర్యలు తక్షణమే చేపట్టాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షలకు పెంచాలని, హెచ్ ఆర్ పాలసీని అమలు చేయాలని సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ముమ్మిడివరంలో పొర్లు దండాలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

అనంతరం పొర్లు దండాలలో నిరసన చేస్తూ ప్రభుత్వానికి కనువిప్పు కలాగాలని కోరారు. వీరికి ఎస్‌టియు, యుటిఎఫ్ సంఘాలతో పాటు కార్మిక సంఘాలు సిఐటియు నాయకులు జి.దుర్గా ప్రసాద్ మద్దతు తెలిపారు. ఈ సమ్మెలో సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే 'ఇకెవైసి' నమోదు

ప్రజాశక్తి - ఆలమూరు

గ్యాస్ ఇకెవైసి కోసం వినియోగదారులు ఏజెన్సీల వద్ద క్యూ కట్టాల్సిన అవసరంలేదని ఎంఎస్ఒ సుబ్బరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.. ఆయన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ఆలమూరు మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న గ్యాస్ వినియోగదారులకి ఇకెవైసి ప్రక్రియ అనేది వారి చిరునామా వివరాలు సరిచేయడం కోసమే జరుగుతుందన్నారు. గ్యాస్ కనెక్షన్ కు ఇకెవైసి చేయాలని ప్రభుత్వం నిబం ధనల నేపథ్యంలో గ్యాస్ కంపెనీలకు వెళ్ల వలసిన అవసరం లేకుండానే ఆన్లైన్ లోనూ ఇకెవైసి చేసుకోవచ్చునన్నారు. ఇకె వైసి చేసుకునేందుకు నిర్ణీత గడువు అం టూ ఏమీ లేదన్నారు. ఆయా ఏజెన్సీల ద్వా రా గ్యాస్ ఇంటికి తీసుకువచ్చే డెలి వరీ బాయ్‌ల తమ మొబైల్‌ఫోన్ ద్వారా ఆన్లైన్‌లో ఇకెవైసి ప్రక్రియ పూర్తి చేస్తారన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మండపేట

'మరలి రాదు ఈ జీవితం" అనే నినాదంతో ఐడియల్ యూత్ మూవ్ మెంట్ సంస్థ చేపట్టిన మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమ పోస్టర్‌ను ఎస్ఐ అశోక్ శనివారం ఆవిష్కరించారు. స్థానిక అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 29 నుంచి జనవరి 7 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. వ్యసనాలతో యువత తమ విలువైన జీవితాన్ని వ్యర్థం చేసుకోకూడదని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టా మన్నారు. సంస్థ కార్యదర్శి జాబిర్, సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో శనివారం ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాలుఇవి.. జొన్నాడ-మండపేట ఆర్అండ్‌బి రహదారిపై కొత్తూరు సెంటర్ దాటినా తర్వాత ఒఎన్‌జిసి రిగ్ దగ్గరికి వచ్చేసరికి రావులపాలెం నుంచి బైక్ పై స్వగ్రామం వెళ్తున్న వ్యక్తి కావేరి ట్రావెల్స్ బస్సు వెనకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడని ఆలమూరు పోలీసులు తెలిపారు. అతనిని గండేపల్లి మండలం వీరేంద్రపురంకి చెందిన నక్కావీరన్న (29)గా గుర్తించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలో చేయ్యేరు పంచాయతి శివారు ఉప్పు చెరువు కొబ్బరి తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని కాట్రేనికోన ఎస్‌ఐ ఎస్. నాగేశ్వరరావు తెలిపారు. పేకాటశిబిరంపై పోలీసుల దాడి చేసి రూ.32 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ట్రైనీ డిఎస్‌పి విష్ణు స్వరూప్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు.

అదే ప్రాంతంలో జరుగుతున్న పందుల పందేలపై దాడి చేసి ఐదుగురు వ్యక్తలను అదుపులోకి తీసుకున్నారు. ఈ రెండు సంఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్రల లోడు లారీ బోల్తా

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం జాతీయ రహదారి జిఎస్‌ఎల్ మెడికల్ కళాశాల పెట్రోల్ బంక్ ఎదురుగా కర్రలలోడుతో వెలుతున్న లారీ శనివారం తెల్లవారుజామున తిరగపడింది. నర్సీపట్నం నుంచి రాజమహేంద్రవరంలో పేపర్ మిల్లుకు కర్రలలోడుతో వెలుతున్న లారీ వెనుక నుంచి వస్తున్న వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో లారీ డివైడర్ ఎక్కి రహదారిపై తిరగబడింది. కర్రలు రహదారికి అడ్డంగా పడడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో మెడికల్ కళాశాలకు సర్వీస్ రోడ్డు మీదుగా వాహనాలను మళ్లించారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

నాటుసారా విక్రయం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఇబి సిఐ డి.సుధా ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వేల్లచింతలగూడెం గ్రామంలో కుక్కల సూర్య మోహనకృష్ణ అనే వ్యక్తి సారా అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బందితో కలిసి దాడి చేసి 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని మోహనకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే గతంలో సారా కేసుల్లో ఉన్న గుబ్బల సాయిబాబును తహశీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రామవరంలో రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగార్జున రాజు తెలిపిన వివరాలివి. జగ్గంపేట మండలం రంగవల్లి నగర్‌కు చెందిన గాడి లక్ష్మి (62) రామవరం వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో ఢీకొని వెళ్ళిపోయాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. .



సర్పంచ్ ఆశీర్వాదానికి పుస్తకాలు అందజేస్తున్న దాత సాహెబ్

పుస్తకదాత సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-మండపేట

ఏడిద గ్రామంలోని దాత సహకారంతో నిర్మించిన గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ చేసిన విశాఖపట్నం నేవెల్ డాక్యార్డ్ విశ్రాంత ఉద్యోగి షేక్ మీరా సాహెబ్ సేవలు అభినందనీయమని గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో గ్రంథాలయానికి సర్పంచ్ చేతుల మీదుగా పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తో కలిసి సాహెబ్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలు రాసేందుకు పుస్తకాలు దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదువుకుని జ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. అనంతరం దాతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీర్రాజు, సాహెబ్ కుటుంబ సభ్యులు అజీమున్నిషా, హుస్సేన్, రసూల్, రహీమా తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆలమూరు

ఆలమూరు మండల యుటిఎఫ్, డైరీ, క్యాలెండర్‌ను ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు సీతామహాలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ నాగేశ్వరరావు, మండల వైసిపి కన్వీనర్ తమ్మన శ్రీనువాసు, ఆలమూరు గ్రామ వైసిపి అధ్యక్షులు రావాడ సత్తిబాబు, గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు, వివిధ శాఖల మండల అధికారులు, యూటీఎఫ్ నాయకులు వైవివి రమణ, అద్దరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎల్ఎ పర్వత పుట్టినరోజు

ప్రజాశక్తి-రౌతులపూడి

ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ పుట్టిన రోజు వేడుకలు వైసిపి కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రమణమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు వాసిరెడ్డి భాస్కర్ బాబు తదితరులు ఉన్నారు.

మంత్రుల ఇళ్ల ముట్టడి

19వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె



అమలాపురంల మంత్రి విశ్వరూప్‌కు వినతిపత్రం అందజేస్తున్న కె.కృష్ణవేణి, అంగన్‌వాడీ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-యంత్రాంగం

డిమాండ్ల పరిష్కారంకోసం అంగన్‌వాడీలు సమ్మె శనివారం 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా తమ డిమాండ్లు పరిష్కరించాలని అంగన్‌వాడీలు నిరసన తెలిపారు.



మంత్రి పినిపే విశ్వరూప్ ఇంటిని ముట్టడించిన ముమ్మిడివరం ప్రాజెక్ట్ అంగన్ వాడీలు

మంత్రులు, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఇళ్లను ముట్టిడించి నిరసన తెలిపారు.

అమలాపురం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఇంటిని అంగన్‌వాడీలు ముట్టడించారు. ఈ కార్యక్రమం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి పరిష్కరించాలని ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని నినాదాలు చేశారు. అయితే ఆ సమయంలో మంత్రి ఇంటి వద్ద లేకపోవడంతో వారు ఇంటి ముందే నిరసన కార్యక్రమం నిర్వహించి నినాదాలు చేశారు. మంత్రులు, ఎంఎల్‌ఎలు సమస్యను సిఎం దష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చినా అది అమలు కాలేదనిఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు ఎం దుర్గ, వరలక్ష్మి, జహీరా, తదితరులు నాయకత్వం వహించారు. **ముమ్మిడివరం** సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ అంగన్ వాడీలు మంత్రి విశ్వరూప్ ఇంటిని ముట్టడించారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అధ్యక్ష కార్యదర్శులు దుర్గా మల్లేశ్వరీ,జయలక్ష్మీ అద్వర్యంలో సమ్మెలో పాల్గొన్న అంగన్ వాడి వర్కర్లు శిబిరం నుండి ఆటో లలో వెళ్లి అమలాపురంలో మంత్రి విశ్వరూప్ ఇంటిని ముట్టడించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ అంగన్ వాడి సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కషి చేస్తానని హామీనిచ్చారు. సమస్యలు త్వరితగతిన పరిష్కారం



రామచంద్రపురంలో మంత్రి వేణు ఇంటి వద్ద అంగన్‌వాడీల నిరసన

కానీ పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి దుర్గా ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పాము బాలయ్య పేర్కొని మద్దతు తెలిపారు. ఈ ముట్టడిలో సుబ్బలక్ష్మి, హైమావతి, టి.శ్రీదేవి, తలుపులమ్మ, జి.మంగాయమ్మ, విజయ రత్న కుమారీలతో పాటు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు. **మామిడికుదురు** అంగన్ వాడీ వర్కర్లు వివిధ మార్గాల్లో అడుగడుగునా పోలీస్ వలయాలను దాటుకుని అమలాపురం లో మంత్రి విశ్వ రూప్ ఇంటి వద్ద అందోళన చే పట్టారు. సానిక ఎంఎల్‌ఎ, జిల్లా మంత్రులు తమ సమస్యలను సిఎం దృష్టికి తీసుకు వెళతామని హామీ ఇచ్చి విస్మరించారని అంగన్‌వాడీలు అన్నారు.



మంత్రి విశ్వరూప్ ఇంటివద్ద మామిడికుదురు అంగన్‌వాడీలు

యానాం వార్తలు

డ్రీమ్స్‌లో ఉత్సాహంగా న్యూయర్ వేడుకలు

ప్రజాశక్తి - యానాం

యానాం డ్రీమ్స్ ఫౌండేషన్ ఉన్నత పాఠశాలలో శనివారం 2024 నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. వేడుకల సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. 2024 ప్లకార్డులు, బెలూన్లను ప్రదర్శించారు. విద్యార్థులచే ఏకో ఫ్రెండ్లీ గ్రీటింగ్స్ కార్డులను తయారు చేయించారు. పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల మేనేజర్ శేరు వర్మ, ప్రధానోపాధ్యాయిని మాధ్యూ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - యానాం

యానాం నుంచి ఆంధ్ర ప్రాంతానికి శుక్రవారం అర్ధరాత్రి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. యానాం నుంచి రూ.12,500 విలువైన 74 మద్యం బాటిళ్లను అంబేద్కర్ కోనసీమ జిల్లా, మురమళ్లకు చెందిన కట్టా గణేష్ బైకుపై తరలిస్తుండగా కనకాలపేట ఏటిగట్టు ప్రాంతంలో పట్టుకున్నామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుని యానాం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు అప్పగించామన్నారు.

మృతుల కుటుంబాలకు టిడిపి శ్రేణుల పరామర్శ

ప్రజాశక్తి-అంబాజీపేట



నందంపూడిలో మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న టిడిపి శ్రేణులు

అంబాజీపేట సీనియర్ నాయకులు బి.అరుణరావు ఇటీవల మరణించారు. ఆయన కుటుంబ సభ్యులను శనివారం నియోజకవర్గ టిడిపి శ్రేణులు పరా మర్శించారు.

నంద ంపూడి బూత్ 124 కన్వీనర్ సవరపు వెంకట దుర్గారావు చిన్నపాప తేజోలత ఇటీవల ఆకస్మికంగా మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులను నియోజకవర్గ టిడిపి శ్రేణులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్‌పి ఛైర్మన్ నామన రాంబాబు, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు డి.శ్రీనురాజు, గూడాల ఫణి, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు బొంతు పెదబాబు, ఎన్‌వి.సుబ్బారావు, కాప నాగభూషణం, పితాని ఈశ్వరరావు, కేతా అర్జునరావు, కె.ఈశ్వరరావు, టిడిపి శ్రేణులు ఉన్నారు.

'కొబ్బరి' ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో కొబ్బరి, విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను అన్ని విధాలా చైతన్య పరిచి జిల్లా నుంచి ఆయా ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించే దిశగా జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ హాల్ నందు జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహ కమిటీ పదవ సమావేశం జిల్లా కలెక్టర్ కమిటీ ఛైర్మన్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన కమిటీ సభ్యులతో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొబ్బరివిలువ ఆధారిత పరిశ్రమలకు మంచి పొటెన్షియల్ ఉందని ఆ దిశగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి రాయితీలు ద్వారా ప్రోత్సహించాలన్నారు. సింగల్ విండో పద్ధతిలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల అనుమతులు జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పథకాల కింద రాయి తీలతో ప్రోత్సహించి యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. చక్కటి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపొందించడం పట్ల జిల్లా కలెక్టర్ కమిటీ కన్వీనర్‌ను అభినందించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ఎడి శివ శివరాం ప్రసాద్, ఎల్‌డిఎం కె.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల రక్షణపై సమీక్ష

స్థానిక కలెక్టరేట్ సమావేశపు హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పౌర హక్కుల రక్షణ, ఎస్‌సి, ఎస్‌టిలపై దురాగతాల నివారణ చట్టం అమలుపై, జిల్లా అప్రమత్తత పర్యవేక్షణ అధికారులతో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలపై ఎటువంటి దాడులు జరగకుండా ప్రజానీకం అంతా సామరస్య పూర్వకంగా జీవించేలా చట్ట ప్రకారం అవగాహన పెంపొందించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి నిరుపేదలకు ఉన్నతి పథకం ద్వారా యూనిట్లు మంజూరు చేస్తూ వారి జీవన ప్రమాణాలు పెంపుదలకు, పేదరిక నిర్మూలన కార్యక్రమాల ద్వారా పాటు పడాలన్నారు. . నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఆయా సామాజిక వర్గాల యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందిం చాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.

ఇవిఎంల భద్రతకు చర్యలు

ముమ్మిడివరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవిఎం)ల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల్లోని జిల్లా కార్యాలయాల ప్రాంగణం మూడవ అంతస్తు లో భద్రపరిచిన ఇవిఎం మిషన్లు, వీవీప్యాట్ గోదాములను శనివారం కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎన్నికల సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల రక్షణ మరియు భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, సిహెచ్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట పాత రామాలయం వీధికి చెందిన చోడపనీడి దుర్గా వంశీ గత ఏడాది ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామ సమీపంలో పంట కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం రూ.5 లక్షల చెక్కు మృతుని కుటుంబ సభ్యులకు అందజేయ వలసి ఉంది. ఈ మేరకు శనివారం కాకినాడ లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్, కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ చేతుల మీదుగా మృతుడు దుర్గావంశీ కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు.

విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-అమలాపురం

విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి తగదని వెంటనే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు డిమాండ్ చేశారు. శనివారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో స్థానిక ఎలీమ్ విద్యాసంస్థల ఆవరణంలో విద్యా రంగ సమస్యలపై విద్యార్థి సదస్సు నిర్వహించారు. పిడిఎస్‌యు జిల్లా కన్వీనర్ ఎస్.రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు విచ్చేసిన తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థులు సమస్యల వలయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీటిని పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం సిగ్గుచేటని ఆరోపించారు. ఈ విద్యా సంవత్సరం విడతల వారీగా విడుదల చేసిన విద్యా దీవెన వసతి దీవెన ఇప్పటికీ పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడం వలన పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుకపూడి గ్రామ టిడిపి అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ప్రజాశక్తి-అంబాజీపేట

ఇసుకపూడి గ్రామ శాఖ టిడిపి అధ్యక్షునిగా గుమ్మడి సత్య నారాయణ, కార్యదర్శిగా యన మదల సాయి బాబా ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. మండల శాఖ అధ్యక్ష కార్య దర్శులు దంతు లూరి శ్రీనురాజు, గూడాల ఫణి, జిల్లా అధికార ప్రతి నిధి డివివి.సత్యనారాయణ పర్యవేక్షణలో శనివారం ఎన్నిక జరిగింది.

ఈ కార్యక్రమంలో కత్తుల సాయిబాబు, ఎన్‌వివి.సత్యనారాయణ మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. వీరంతా నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సైంటిస్ట్‌గా సందీప్

ప్రజాశక్తి-ఆలమూరు

నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సైంటిస్ట్‌గా మండలంలోని కలువచర్లకు చెందిన తాతపూడి సందీప్ కుమార్ ఎంపికయ్యారు. యూకేజీ నుంచి పదవ తరగతి వరకు స్థానికంగానే చదివిన సందీప్ పాలిటెక్నికల్, పెట్రోలియం కెమికల్ ఇంజినీరింగ్, ఆంధ్ర యూనివర్సిటీలో బీటెక్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. అనంతరం న్యూఢిల్లీలో నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సైంటిస్ట్ గా ఉద్యోగం సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రి టి.అబ్బులు విఆర్‌ఒగాను, తల్లి సుశీల అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కుమారుడు సెంట్రల్ గవర్నమెంట్‌లో మంచి ఉద్యోగం సాధించినందుకు వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సందీప్ ను మండలంలోని పలువురు ప్రముఖులు అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్య అన్నదాన ట్రస్ట్‌కు ఆచంట మండలం వల్లూరు వాసులు చిట్టూరి పెద్దిరాజు భారతి లక్ష్మీ దంపతులు పెళ్లి రోజు ప్రతీ ఏటా జూన్ 12న అన్నదానం జరిపించేందుకు శనివారం రూ.10వేలు విరాళం ఇచ్చారని ఆలయ సహాయకమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. శనివారం లడ్డు, టిక్కెట్ విక్రయాల ద్వారా రూ.1,41,160 మరియు నిత్యాన్నదాన ట్రస్ట్ కు రూ.48,452 మొత్తం రూ.1,89,612 ఆదాయం వచ్చిందన్నారు.

'ద్రాక్షారామ' విఆర్‌ఒపై దాడి

ప్రజాశక్తి-రామచంద్రపురం

విధుల్లో ఉన్న ద్రాక్షారామ విఆర్‌ఒ కె.సాయిబాబాపై ఒక వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. దీనిపై విఆర్‌ఒ పోలీసులకు శనివారం ఫిర్యాదుచేశారు. వివరాలు ఇవి.. విధులు నిర్వహిస్తున్న సమయంలో ద్రాక్షారామ బియ్యం పేటకు చెందిన నరాల రవి ఇంటి పన్ను, కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిన కారణంగా విఆర్‌ఒపై దాడి చేసి గాయపరిచాడు. విఆర్‌ఒను స్థానికులు, వాలంటీర్లు, విఎఎలు రక్షించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు ఈ ఘటనపై ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్లో ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ద్రాక్షారామ విఆర్‌ఒ సాయిబాబా పై దాడి చేసి గాయపరిచిన నరాల రవిని అరెస్టు చేసి శిక్షించాలని విఆర్‌ఒ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల గౌరవ అధ్యక్షులు మద్దాల బాపూజీ డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా నానబెల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర కి విజ్ఞప్తి చేశారు శనివారం పైడా వారి సత్రంలో రామచంద్రపురం మండలం విఆర్‌ఒల అత్యవసర సమావేశం జరిగింది. సమయపాలనతో నిమిత్తం లేకుండా సెలవు దినాలలోనూ పనిచేస్తూ ప్రజలకు అనేక సేవాలు అందిస్తారని వారిపై దాడులు చేయడం అమానుష మని ఇటువంటి చర్యలు పునరావతం కాకుండా నానబెల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని ద్రాక్షారామ ఎస్సై జి. సురేంద్ర కి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి మల్లేష్, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమనాయుడు, కష్ణ సాయి, సంఘం మండల ప్రెసిడెంట్ పంపన విష్ణుమూర్తి, సెక్రటరీ గ్రంధి సురేష్, ఉపాధ్యక్షులు సత్యవతి తదితరులు పాల్గొన్నారు. విఆర్‌ఒపై దాడి చేసిన నరాల రవి అనే వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గం మైనార్టీ బిసి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాట్ల నాగేశ్వరరావు, పోతాబత్తుల విజయ్ కుమార్, వేమవరపు రాంబాబు, కురవాడ కొండ బాబు తదితరులు పాల్గొన్నారు

పాఠశాలల్లో ఉల్లాసంగా 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మండలంలో ఆయా జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో ఉల్లాసంగా జరుగుతున్నాయి. వివిధ విభాగాలలో క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతున్నారు. గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో క్రికెట్ మ్యాచ్‌ను సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ప్రారంభించారు. క్రీడాకారులను ఎంపిడిఒ కెవిఎస్.గౌరీ కుమారి పరిచయం చేసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. వైసిపి కార్మిక విభాగం మండల అధ్యక్షుడు వీరవల్లి చినబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బడుగు గణేష్, సచివాలయ కన్వీనర్ పోలిశెట్టి వీరబాబు, వైసిపి నాయకుడు జొన్నాడ చిన్ని, పాఠశాల హెచ్ఎం, ఎల్.రాణి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

ప్రజాశక్తి -మండపేట

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహారం వండలేమని మధ్యాహ్న భోజనం కార్మికులు మండల విద్యాశాఖ అధికారులకు ఎం.శ్రీనివాస్, వి.నాగేశ్వరిలకు సిఐటియు ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందించారు. మధ్యాహ్న భోజన పథకం, శానిటేషన్ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కొమ్ము సత్యవేణి మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా మధ్యాహ్నం భోజన పథకంలో కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. వారికి ఇచ్చే గౌరవవేతనం, బిల్లులు ప్రతినెల సక్రమంగా రాకపోవడంతో అప్పులు చేసి వండి పెడుతున్నారన్నారు. ఈ పరిస్థితులో వీరికి అంగన్‌వాడీ సెంటర్లకు వంట చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం దారు ణమన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వంట చేయడం కుదరదన్నారు.

మండపేట మున్సిపల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన సాధారణ సమావేశానికి ఛైర్పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధక్యక్షత వహించగా ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. కౌన్సిల్ సమయంలో పారిశుధ్య సిబ్బంది సమ్మె చేసినపుడు సిబ్బందితో సంప్రదించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశామని అదేవిధంగా సానుకూల చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ అన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం అదనపు సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టిన్లు కమిషనర్ టి.రామకుమార్ తెలిపారు. ప్రస్తుత కౌన్సిల్సభ్యుల పేర్లతో మరద్రించిన నామఫలకాన్ని మున్సిపల్ కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటుచేసిన ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఆవిష్కరించారు.

పాఠశాల్లో ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక జిల్లా ప్రజాపరిషత్ బాలికోన్నత పాఠశాల్లో 8వ తరగతి విద్యార్థులకు బైజ్యూస్ కంటెంట్ తో కూడిన ట్యాబ్‌లను శనివారం ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 2289 మంది విద్యార్థులకు రూ.7 కోట్ల 30 లక్షల రూపాయలు విలువైన ట్యాబ్ లు పంపిణీ చేస్తున్నామని, విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని మనబడి నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు సమూలంగా మర్చివేసి ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ యనమల నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

'సామంతకుర్రు'లో పంచాయతీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం

సామంతకుర్రు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సామంతకుర్రు గ్రామంలో ఎప్పటి నుంచో పెండింగ్లో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఉపాధిహామీ,గడపగడపకు మన ప్రభుత్వం నిధులైన రూ.15లక్షలతో నిర్మించుకుని ప్రారంభించుకోవడం శుభపరిణామమన్నారు. అనంతరం మంత్రి సామంతకుర్రు వద్ద చల్లపల్లి-వాసాలతిప్ప రోడ్డు నుంచి సామంత కుర్రు గాంధీనగర్ వరకు నిర్మించిన బీటీ రోడ్లును ఆయన ప్రారంభించారు. అనంతరం కోడూరుపాడు నందు నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని పలు చారిత్రాత్మక కార్యక్రమాలను అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్, స్థానిక ఎఎంసి ఛైర్మన్ దంగేటి డోలమణి రుద్ర, ఎంపిపి ఇళ్ల శేషారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు భవన నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-ఆలమూరు

ఆలమూరు ఎస్‌టియు భవన నిర్మాణానికి కొత్తపేట ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శనివారం భూమి పూజ చేశారు. మండల కేంద్రమైన ఆలమూరు వినాయకుడి గుడి సెంటర్ వద్ద ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండే విధంగా ఆలమూరు ఎస్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భవనానికి స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలమూరు సర్పంచ్ ఎస్ లావణ్య కుమార్ రాజా, ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, వైసిపి మండల కన్వీన తమ్మన శ్రీనివాసు, జెడ్‌పిటిసి సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.